విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాప్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
ఆదివారం 18 జనవరి 2025

# అనంతపురం ఎమ్మెల్యేపై కుట్ర కోణం

- కొందరి ప్రోద్బలంతోనే ఎమ్మెల్యే పై అభాండాలు
- మద్యం కేసు నిందితుల అరెస్టుతో బట్టబయలు అయిన వైనం



అనంతపురం , జనవరి 17 (అనంత ప్రభ)
అనంతపురం నగరంలో ఏ చిన్న సంఘటన జరిగినా అది ఎమ్మెల్యేకు ఆపాదించడం పరిపాటిగా మారింది... నగరంలో ఏ టిడిపి కార్యకర్త తప్పు చేసినా ఎమ్మెల్యే దగ్గుబాటి చేయించారని మీడియా ముఖంగా చెప్పడం వెనుక ఒకరిద్దరు నాయకులు హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి..... బైపాస్ రోడ్డులో ఉన్న నంబూరి వైన్స్ దగ్ధం చేసిన కేసులో ప్రధాన నిందితుడు అఖిల్ తాను ఫోన్ పే ద్వారా చెల్లించినా, డబ్బు తిరిగి చెల్లించాలని కోరడంతోనే ఈ వివాదం జరిగినట్లు విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు... ఎమ్మెల్యే గంగారం ప్రధాన అనుచరుడైన మోహన్, అఖిల్ లకు ఈ సంఘటనతో ప్రత్యక్ష సంబంధం ఉండడంతో ఏకంగా గంగారంపై కేసు నమోదు చేశారు... అఖిల్ ప్రకటనతోనే ఎమ్మెల్యేకి ఏమాత్రం సంబంధం లేనట్లు స్పష్టమవుతున్నదని ఆయన అనుచరులు తెలియజేస్తున్నారు... వివరాల్లోకి వెళితే

దివంగత తెలుగుదేశం నాయకుడు జఖీవుల్లా ఆధ్వర్యంలో అందరూ సిండికేట్ గా ఏర్పడి మద్యం షాపు టెండర్లు వేశారు... 9 షాపులకు గాను 18 లక్షల రూపాయలు వెచ్చించి టెండర్లు వేశారు... నంబూరి రమణ పేరుతో టెండర్ తగిలింది... అందరి భాగస్వామ్యంతో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా... కొందరితో లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకొని స్వతంత్రంగా మద్యం షాపు రమణ నిర్వహించాడు... తమకు పెట్టుబడి సొమ్ము ఇవ్వాలని పలుసార్లు బాధితులు డిమాండ్ చేసినా రమణ ఖాతరు చేయలేదు... ఒప్పందం కుదుర్చుకున్న వారికి కూడా డబ్బు ఎగవేయాలనే ఆలోచనతో దాదాపు 18 నెలల తర్వాత టెండర్ ప్రక్రియలో పాల్గొన్న వారికి ఎటువంటి లాభం ఇవ్వకుండా ... మోసం చేసి 14 లక్షలు విడతల వారీగా రమణ ముట్ట జెప్పాడు... ఒక ముస్లిం మైనార్టీ నాయకుడు తన భార్య మెడలోని బంగారు గొలుసును తాకట్టుపెట్టి ఐదు లక్షల రూపాయలు మద్యం షాపు టెండర్ల కోసం ప్రసాద్ కు ఇచ్చాడు... ఆ సొమ్ము చెల్లించాలని అనేకమంది నాయకులతో ఒత్తిడి తెచ్చినా ప్రసాద్ ఏమాత్రం ఖాతరు చేయలేదు...

తమ నాయకుడికి లాభాల పంపిణీ విషయంలో ఒప్పందం చేసుకున్న ప్రకారం ఎందుకు ఇవ్వడం లేదని రమణాను తెలుగుదేశం పార్టీ నాయకుడు మోహన్ ప్రశ్నించినట్లు సమాచారం... అలాగే టెండర్ ప్రక్రియలో భాగస్వామ్యులుగా ఉన్న ఇతరులు కూడా లాభాలలో వాటా ఇవ్వకుండా కేవలం చెక్కులు వెనుకకు ఇవ్వడం ఏమిటని నంబూరి రమణను నిలదీశారు... ఇష్టమైతే తీసుకోండి... లేకపోతే అసలు కూడా ఇవ్వను అని వారిపై దౌర్జన్యానికి రమణ పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు...

ఇది ఇలా ఉండగా రెండు రోజుల క్రితం అఖిల్ ... నంబూరి వైన్స్ అనధికార పర్మిట్ రూంలో మద్యం సేవించడానికి వెళ్లాడు... తాను ఫోన్ పే చేసిన డబ్బు రాలేదని ప్రశ్నించగా, తీవ్ర పదజాలంతో షాపు నిర్వాహకులు దూషించినట్లు అఖిల్ పోలీస్ విచారణలో వెల్లడించారు.. దీంతో తన అన్న మోహన్ కు ఈ విషయం తెలియజేసినట్లు అంగీకరించాడు... రమణ తో ఫోన్లో తీవ్ర పదజాలంతో దూషించుకోవడం, వాటాల ఎగవేత తదితర సంఘటనలతో పాటు తన సొంత తమ్ముడిని మందలించడం మోహన్ కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది... వెంటనే తమ్ముడైన అఖిల్ మరికొందరు కలిసి అర్ధరాత్రి సమయంలో బ్రాందీ షాప్ కు నిప్పు పెట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.... ఏ మాత్రం సంబంధం లేకపోయినా, ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేయడం కొందరు నాయకులకు ఆనవాయితీగా మారింది అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు... నిందితుడే స్వయానా ఫోన్ పే విషయంలో తలెత్తిన ఘర్షణతోనే షాపు దహనానికి పాల్పడినట్లు తెలియజేయడంతో ఎమ్మెల్యే పాత్ర పై ఉన్న అనుమానాలు పటాపంచలయ్యాయి.అనంతపురం నగరంలో మరియు రూరల్ ఏరియాలో జరిగిన ముందు దగ్గుపాటి పేరు వాడుకోవడం ఇది ఒకరు చేసి తప్పిద్దాలకు దగ్గుపాటిని వాడుకోవడం మంచిది కాదు అంటూ ఇది వరకే తప్పు చేసే ఎవరైనా చట్టం ముందు అందరికి ఒకే చట్టం వర్తిస్తుంది ఎన్నో సార్లు మీడియా ముందు పదే పదే చెప్పిన దగ్గుపాటి అనుచరులు ఆలోచన చేయలేదు ఇప్పటికి అయినా ఈ విషయం ఆలోచన చేయాలి అంటూ ప్రజలకు మేలు చేయాలి తప్ప ఒకరికి హాని చేయడం మానుకోవాలి అంటూ కూటమి యం. యల్. ఏ. దగ్గుపాటి ఎన్నో సార్లు తమ తెలుగుదేశం కార్యకర్తలకు సూచించిన వారి మాటాలకుకట్టుబడి లేనంట్లుగా వుంది అంటూ ప్రజా అభిప్రాయం తెలుస్తుంది

## గొట్లూరులో స్థల వివాదం



- అంగన్వాడీ స్థలంలో విగ్రహ నిర్మాణానికి ప్రయత్నం
- అధికారులు స్పందించి యథావిధిగా అంగన్వాడి సెంటర్ నిర్మించాలి
- గొట్లూరు గ్రామ పెద్దల డిమాండ్

ధర్మవరం, జనవరి 17 (అనంత ప్రభ)
శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం రూరల్ గొట్లూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్‌కు కేటాయించిన స్థలంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రయత్నం తీవ్ర వివాదానికి దారితీసింది.అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గత నెలలో అంగన్వాడి భవనాన్ని జెసిబీ సహాయంతో తొలగించడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
ఈ ఘటనపై గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి అంగన్వాడికి కేటాయించిన స్థలం అంగన్వాడికే సెంటర్ కె ఉండాలని,విగ్రహ ఏర్పాటు కోసం వేరే అనుకూలమైన స్థలాన్ని కేటాయిసామని గ్రామ పెద్దలు స్పష్టంగా తీర్మానించారు. అయినప్పటికీ ఈ స్థల వివాదం కోర్టులో స్టే ఉండగానే కొందరు వ్యక్తులు గ్రామ పెద్దల సూచనలను పట్టించుకోకుండా అంగన్వాడి స్థలంలోనే విగ్రహ నిర్మాణానికి పిల్లర్ పనులు ప్రారంభించడం మరింత వివాదానికి దారితీసింది.
ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా వెంటనే అధికారులు జోక్యం చేసుకుని అంగన్వాడి స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగించి, యథావిధిగా అంగన్వాడి సెంటర్‌ను నిర్మించి చిన్నపిల్లలకు అందుబాటులో ఉండేలాగా గ్రామ పెద్దలు డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రామాంజనేయులు, బిజెపి ఓబీసీ మండల అధ్యక్షులు కట్టుబడి వెంకటేష్,టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు తలారి నారాయణస్వామి, మరియు గ్రామ పెద్దలు గిరిక గోపాల్, కాటమయ్య,సాకే రామదాసు, నారాయణస్వామి, పోతలయ్య, పెద్దిరెడ్డి,పిట్ట నరసింహులు, వెంకటరెడ్డి,బిజెపి సోషల్ మీడియా సుబ్బరాయుడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేద్దాం
- అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దు
- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల స్పష్టీకరణ
- అనంతపురంలో వైసీపీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం
- ఫిబ్రవరి 15లోగా గ్రామ, సచివాలయ స్థాయిలో కమిటీల నియామకం

అనంతపురం, జనవరి 17 (అనంత ప్రభ)
ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైఎస్ఆర్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలన్నారు. శనివారం నగరంలోని ఎ--7 కన్వెన్షన్ హాల్‌లో వైసీపీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ టాస్క్ ఫోర్స్ సభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, అనంతపురం పార్లమెంటు పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి (సమన్వయం) వజ్ర భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ, గ్రామ స్థాయి కమిటీల నియామకంపై వారు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు చేయాలని చూస్తున్నారన్నారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకున్న కార్యకర్తలను కాపాడుకునేందుకు తమ జీవితాలను పణంగా పెడతామని భరోసా ఇచ్చారు. అక్రమ కేసులను అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగిస్తామని, తమ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులను చట్టపరంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. వైఎస్ఆర్‌సీపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా గ్రామ, సచివాలయ స్థాయి కమిటీల నియామకం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులు, పార్టీ కోసం పనిచేసే వారిని కమిటీల్లో తీసుకోనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలైనా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని తెలిపారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, తమ పార్టీ కార్యకర్తలు ఎవరూ భయపడే పరిస్థితి లేదన్నారు. తమకు అధికారం ముఖ్యం కాదని, ప్రజల సంక్షేమమే లక్ష్యమన్నారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినా ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశం అనంతరం పార్టీ సంస్థాగత నిర్మాణంపై వజ్ర భాస్కర్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.




## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రాయదుర్గంలో మెగా రక్తదాన శిబిరం

రాయదుర్గం, జనవరి 17 (అనంత ప్రభ)
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాయదుర్గం పట్టణం బళ్లారి రోడ్డులోని సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణమండపంలో శనివారం రక్తదాన శిబిరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలకు, కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ వచ్చి రక్తదానం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే రక్తదాన శిబిరంలో రక్తదాతలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని వివరించారు.రక్తదానం మహాదానమనీ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్తదానం ద్వారా మీరు రక్షించిన వారు అవుతారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషిచేసిన మహోన్నత వ్యక్తికి మనమిచ్చే ఘనమైన నివాళిలో అందరూ పాల్గొనాలన్నారు. యువతి, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేరుపేరునా విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ కు చెందిన ఎన్టీఆర్ ట్రస్ట్, బళ్ళారి విమ్స్ ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. చికిత్స కోసం మన నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది బళ్లారి ఆసుపత్రికి వెళుతుంటారన్నారు. కావునా మనంచేసే రక్తదానం మన నియోజకవర్గ ప్రజలకే ఎక్కువగా ఉపయోగపడుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,మండల కన్వీనర్ కురుబ హనుమంతు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, బుదురు తిప్పేస్వమి, అగ్రహారం కిరణ్ ,ఇనాయత్, వై.వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



## శింగనమలలో వైభవంగా హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజీ దర్గా ఉరుసు మహోత్సవాలు

శింగనమల, జనవరి 17 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా శింగనమల మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజీ దర్గా ఉరుసు మహోత్సవాలు
ఈ ఏడాది అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. కులమతాలకు అతీతంగా, హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండే కాకుండా పొరుగు జిల్లాల నుండి కూడా భక్తులు భారీగా తరలివస్తారు.
ఉత్సవాల వివరాలు:
తేదీలు: జనవరి 16 (శుక్రవారం) నుండి జనవరి 18 (ఆదివారం) వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయి.
ముఖ్య ఘట్టాలు: గంధ మహోత్సవం, దర్గాకు చాదర్ సమర్పణ మరియు ప్రత్యేక ప్రార్థనలు ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.
భక్తుల నమ్మకం:
ఈ దర్గాకు ఒక ప్రత్యేకత ఉంది. అనారోగ్య సమస్యలతో, ముఖ్యంగా మానసిక ఆందోళనలు లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉరుసు సమయంలో దర్గా ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిద్ర (తంగేడ) చేస్తే వారి సమస్యలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.
నిర్వాహకుల ఏర్పాట్లు:
భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్గా కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.
అన్నదానం: ఉరుసు జరిగే మూడు రోజులు భక్తుల కోసం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.




వసతులు: తాగునీరు, విద్యుత్ దీపాలు మరియు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వసతులను కల్పించారు.
భద్రత: ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.
మత సామరస్యానికి వేదికైన ఈ ఉరుసు మహోత్సవంలో పాల్గొని, బాబా ఆశీస్సులు పొందాలని దర్గా కమిటీ భక్తులను కోరుతోంది

## హరిత ధర్మవరం -- స్వచ్ఛ ధర్మవరం లక్ష్యంగా 10,000 చెట్ల నాటే వృక్షారోపణ కార్యక్రమం

ధర్మవరం, జనవరి 17 (అనంత ప్రభ)
ధర్మవరం పట్టణం ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్‌లో ఆదివారం హరిత ధర్మవరం -- స్వచ్ఛ ధర్మవరం లక్ష్యంగా ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా 10,000 చెట్లను నాటే మహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రేరణతో దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ప్రజలను భాగస్వాముల్ని చేసే ఉద్దేశంతో ప్రారంభించిన ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమ స్ఫూర్తితో, అదే భావజాలాన్ని ధర్మవరం నియోజకవర్గంలో విస్తృతంగా అమలు చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన తల్లి పేరుతో ఒక చెట్టు నాటి, పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా ప్రకృతితో భావోద్వేగ బంధాన్ని పెంపొందించుకోవాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామూహిక బాధ్యత అని మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన జీవన విధానం అందించాలంటే నేటి తరమే చెట్లు నాటి ప్రకృతిని సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ధర్మవరం నియోజకవర్గాన్ని హరితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వెల్లడించారు. ఈ 10,000 చెట్ల నాటే కార్యక్రమంలో పట్టణం మరియు గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట, ప్రజా ప్రాంగణాల్లో మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించామని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను ప్రజలతో కలిసి తీసుకుంటామని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ధర్మవరం నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. హరిత ధర్మవరం -- స్వచ్ఛ ధర్మవరం అనే నినాదంతో ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమం, ధర్మవరం నియోజకవర్గాన్ని పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలిపే దిశగా ఒక కీలక అడుగుగా నిలవనుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిపారు

